ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 327 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 2 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## గంటసేపు ఉత్కంఠ

### ఐఏఎఫ్ విమానం సేఫ్ ల్యాండ్
### 40 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు

# త్వరలోనే రైతు, ఎడ్యుకేషన్ కమిషన్

### సామాజిక సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టాగోష్టి



హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) త్వరలోనే రాష్ట్రంలో రైతు కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రకటించారు. మన విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని అన్నారు. రైతులు, కౌలు రైతుల సాధక బాధకాలు, వాళ్ల సంక్షేమం, వ్యవసాయ రంగంలో సంస్కరణలకు సంబంధించి రైతు కమిషన్ తగిన సలహాలు సూచనలు అందిస్తుందని అన్నారు. శుక్రవారం సచివాలయంలో వివిధ సామాజిక సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇష్టాగోష్టి ముచ్చటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్ ను తెరిచామని, ప్రజా భవన్ ను ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు అనువుగా అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. అందుకే ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాలకు దరఖాస్తులను స్వీకరించామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యుత్ పరిస్థితి, సాగునీటి రంగం పరిస్థితి పై పూర్తి వివరాలతో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల

..మిగతా 2లో

# రాష్ట్ర స్థాయిలో డీఎస్సీ ప్రక్రియ

విధి విధానాల రూపకల్పన, ప్రశ్నల తయారీ అంతా కేంద్రీకృతంగానే
కీలక పాస్‌వర్డ్స్ అన్నీ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో..
ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే వారి గత చరిత్ర కూడా పరిగణనలోకి
నియామక ఉత్తర్వులు జిల్లా స్థాయిలో..



హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) కొత్తగా ప్రకటించిన డీఎస్సీ విధివిధానా లకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తయింది. ఈ నెల 4వ తేదీన పూర్తి సమాచారం వెలువరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష విధానం, సిలబస్, రిజర్వేషన్లను ప్రకటించాల్సి

..మిగతా 2లో




# ధరణి సమస్యలకు చెక్

### "స్పెషల్ డ్రైవ్" మార్గదర్శకాలు జారీచేసిన రేవంత్ సర్కార్

హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) ధరణి సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ప్రభుత్వం గురువారం మార్గదర్శకాలు జారీ చేసి రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించింది. మార్చి 1 నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభించింది. ధరణి సంబంధిత సమస్యలన్నింటినీ పరిష్కరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసి రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించింది. మార్చి 1 నుంచి 9 వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ క్లియర్ చేయడానికి 'స్పెషల్ డ్రైవ్' చేపట్టింది. మార్చి 9 నాటికి దాదాపు 2.45 లక్షల దరఖాస్తులను క్లియర్ చేయనున్నట్లు అంచనా. ప్రతి తహశీల్దార్ కార్యాలయంలో రెండు మూడు బృందాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సర్క్యులర్ ద్వారా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నివేదికలు సిద్ధం చేసేందుకు ఈ బృందాలు తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఉండాలి. ఈ బృందాల్లో తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో రెవెన్యూ సిబ్బంది, డీఆర్‌డీఏల్లో పనిచేస్తున్న పారాలీగల్‌లు, కమ్యూనిటీ సర్వేయర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉంటారు. గ్రామస్థాయి అధికారులు వాట్సాప్, ఫోన్ లేదా %ఖామీ% ద్వారా సంబంధిత సమాచారాన్ని దరఖాస్తుదారులతో 'టీమ్ లీడ్స్' పంచుకునేలా కలెక్టర్లకు సూచించబడింది. సేత్వార్, ఖాస్రా పహాణీ, పాత పహాణీలు, 1బి రిజిస్టర్, ధరణి సహా భూ రికార్డులను కూడా అధికారులు తనిఖీ చేస్తారు. వారు అవసరమైన సందర్భాలలో అసైన్‌మెంట్, ఇనామ్ లేదా రిజిస్టర్‌లు, భూధాన్, వక్ఫ్ లేదా ఎండోమెంట్ భూమి వివరాలను కూడా ధృవీకరిస్తారు.

#### క్షేత్రస్థాయిలో అధికారుల పర్యటన

అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి భూమిని భౌతికంగా పరిశీలించి స్థానికంగా విచారణ చేయనున్నారు. దరఖాస్తుల ధృవీకరణ, భూమి రికార్డులు మరియు అవసరమైన సందర్భాలలో క్షేత్ర విచారణల ఆధారంగా, బృందాలు ప్రతి దరఖాస్తుపై నివేదికను సిద్ధం చేస్తాయి. ఆదేశాల మేరకు సీసీఎల్ఏ జిల్లాల వారీగా పురోగతిని కలెక్టర్లతో పర్యవేక్షిస్తారు.

#### ధరణిపై త్వరలో శ్వేతపత్రం విడుదల - పొంగులేటి

ఈ తరుణంలో దేవాదాయ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ .. 2.45 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని మీడియాకు తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ తొమ్మిది రోజుల్లో ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను తెలిపారు. "ధరణి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు, దుర్మార్గపు ఉద్దేశ్యంతో

..మిగతా 2లో



# తెలంగాణలో అమల్లోకి గృహజ్యోతి

### "జీరో బిల్లు"లు జారీ చేస్తున్న విద్యుత్ సిబ్బంది
### గృహజ్యోతి పథకం అమలు
### జీరో బిల్లులు జారీ చేస్తున్న విద్యుత్ పంపిణీ సంస్థలు

హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) తెలంగాణలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి 27వ తేదీన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి పథకంకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ పథకం ప్రయోజనాలు నేటి నుంచి రాష్ట్రంలో అమలులోకి వచ్చాయి. గృహజ్యోతి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన విద్యుత్ వినియోగదారులకు తెలంగాణలోని విద్యుత్ పంపిణీ సంస్థలు జీరో బిల్లులు జారీ చేస్తున్నాయి. మీటర్ రీడింగులు తీస్తున్న సిబ్బంది.. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించిన అర్హులకు గృహజ్యోతి జీరో

..మిగతా 2లో

# రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు : సీఎం రేవంత్ రెడ్డి

### సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన జర్నలిస్టులు



సీఎం రేవంత్ రెడ్డి ని సన్మానిస్తున్న జర్నలిస్టులు

హైదరాబాద్, మార్చి 1(ప్రభాత ఉదయం) రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్ట్ లు అందరికి ఇంటి స్థలాలు ప్రభుత్వం సమకూరుస్తుందని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జే)కి సంబంధించి ఇళ్ల స్థలాల అప్పగింతపై రాష్ట్ర రెవిన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డితో జేఎన్‌జే ప్రతినిధులు చర్చించి ఒక రోడ్డుమ్యాప్‌తో తన దగ్గరకు వస్తే ఒక్క నిమిషంలో సంబంధిత ఫైలుపై సంతకం చేస్తానని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఏ సంస్థకు నామినేటెడ్ ఛైర్మన్ నియమించకుండా కేవలం మీడియా అకాడమీకే శ్రీనివాస రెడ్డిని ఛైర్మన్‌గా

..మిగతా 2లో

# బీజేపీలో చేరిన జహీరాబాద్ ఎంపీ

న్యూఢిల్లీ, మార్చి 1 (ప్రభాత ఉదయం) జహీరాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ నేత బీబీ పాటిల్ శుక్రవారం నాడు బీజేపీ లో చేరారు. బీజేపీలో చేరడానికి ముందే బీబీ పాటిల్ బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. నిన్ననే నాగర్ కర్నూల్ ఎంపీ పి. రాములు బీఆర్ఎస్ కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. శుక్రవారం నాడు న్యూఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బీజేపీ తెలంగాణ ఇంచార్జ్ తరుణ్ చుగ్, బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో బి.బి. పాటిల్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014, 2019 ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుండి బి.బి. పాటిల్ బీఆర్ఎస్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. 2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలైంది. దీంతో కొందరు బీఆర్ఎస్ నేతలు

..మిగతా 2లో




# ఇంటర్ పరీక్షల్లో ప్రవేశానికి 5 నిమిషాలు పెంపు

### తెలంగాణ ఇంటర్‌బోర్డు కీలక నిర్ణయం

హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో.. తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షకు ఐదు నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థుల్ని పరీక్షకు అనుమతించాలని నిర్ణయించింది. ఈ మేరకు.. నిర్దిష్ట కారణాల వల్ల విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా చేరుకుంటే ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను అనుమతించాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు ఆయా జిల్లాల అధికారులకు, సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8:45 గంటలకు తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్ కు అనుమతి చేస్తామన్నారు. ఇప్పటివరకు పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించకుండా వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నిబంధన కారణంగా విద్యార్థులు నష్టపోతున్నారనే విమర్శలు ఎక్కువగా వినవస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థి ఈ నిబంధన కారణంగా పరీక్షకు అధికారులు అనుమతించకపోవడంతో.. తండ్రికి సూసైడ్ లేఖ రాసి బలవన్మరణానికి పాల్పడడం తీవ్ర విషాదాన్ని నింపింది.



# త్వరలోనే రైతు, ఎడ్యుకేషన్ కమిషన్

**మొదటి పేజీ తరువాయి...**

చేశామని చెప్పారు. మహిళలు, నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. రైతులు, నిరుద్యోగులకు మేలు చేసేందుకు మరిన్ని చర్యలు చేపడుతామన్నారు. ఎమ్మెల్సీ మహేష్ గౌడ్, యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ విశ్వేశ్వర్ రావు, రమ మేల్కొటే, ప్రొఫెసర్ రియాజ్, ప్రొఫెసర్ పురుషోత్తం, గాదె ఇన్నయ్య, తదితర ప్రతినిధులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. కౌలు రైతుల రక్షణ కు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అందరి సూచనలు , సలహాలు ఆధారంగా కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలనే ఆలోచనలను పంచుకున్నారు. రైతు భరోసా అనేది రైతులకు పంటలకు పెట్టుబడి సాయంగా అందించేదని, రైతు భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. నిస్సహాయులకు, నిజమైన లబ్ధిదారులకు అవసరమైతే చెప్పిన దానికంటే ఎక్కువ సాయం చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉందని చెప్పారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని, అన్ని పంటలు విస్తరించేలా రైతులు సరికొత్త విధానాలను అనుసరించాలని అన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాలయాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలను వేర్వేరు చోట్ల కాకుండా, దాదాపు 25 ఎకరాల్లో ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా ముందుగా కొడంగల్ లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ నెలకొల్పుతామని అన్నారు. దశల వారీగా అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తామని అన్నారు. దీంతో కుల, మత వివక్ష తొలిగిపోతుందని అన్నారు. విద్యార్థుల ప్రతిభా పాఠవాలతో పాటు పోటీ తత్వం పెరుగుతుందని అన్నారు. గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేసినట్లు సీఎం గుర్తు చేశారు. గ్రూప్ 1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని చెప్పారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామన్నారు.

## రాష్ట్ర స్థాయిలో డీఎస్సీ ప్రక్రియ

**మొదటి పేజీ తరువాయి...**

ఉంది. ఇప్పటికే జిల్లాల వారీగా పోస్టుల విభజన జరిగింది. స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, భాషా పండితులు, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు బోధించే టీచర్ల ఖాళీలను వెల్లడించారు. ఈ ప్రక్రియ మొత్తం జిల్లా అధికారుల పరిధిలోనే జరిగింది. ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చే సమయంలో వీరి పాత్ర ఉండనుంది. కానీ పరీక్ష విధివిధానాల రూపకల్పన, ప్రశ్నపత్రాల తయారీ, మూల్యాంకనం, అభ్యర్థుల ఎంపిక అన్నీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్రీకృత వ్యవస్థతోనే డీఎస్సీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రతి పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. ఈ ముగ్గురిలో ఒకరిని రాష్ట్ర విద్యాశాఖ మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తుంది. వారికి జిల్లా అధికారులు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుందని విధివిధానాల్లో పేర్కొననున్నారు.

### ఎక్కడా పొరపాట్లు జరగకుండా..

డీఎస్సీ సిలబస్‌పై అధికారులు ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చినట్లు సమాచారం. సబ్జెక్టు నిపుణులతో వివిధ విభాగాలకు సంబంధించిన ప్రశ్నల తయారీ అంతా రాష్ట్ర అధికారుల పరిధిలోనే జరుగుతుంది. ప్రశ్నపత్రం ఎక్కడా లీక్ అవ్వకుండా సాంకేతిక విభాగాన్ని పటిష్ట పరుస్తున్నారు. అవసరమైన కీలక పాస్‌వర్డ్స్ అన్నీ రాష్ట్ర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉంచాలని నిర్ణయించారు. ముఖ్యమైన విభాగాల్లో పనిచేసే వారి గత చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది. దీంతో ఎలాంటి ఫిర్యాదులు లేని వ్యక్తులను ఎంపిక చేసే పనిలో ఉన్నారు.

### టెట్‌కు 20 శాతం వెయిటేజ్

సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ తదితర పోస్టులకు కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (సీటెట్), ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు నిర్వహించిన టెట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఇవ్వనున్నట్టు తెలిసింది. పరీక్షా సమయం మూడు గంటల పాటు ఉండబోతోంది. మొత్తం 160 ప్రశ్నలతో, 80 మార్కులకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మే 23 నుంచి పది రోజుల పాటు కంప్యూటర్ బేస్డ్‌గానే పరీక్ష ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ డీఎస్సీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదనపు జిల్లా కలెక్టర్ వైస్ ఛైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా పరిషత్ సీఈవోలు సభ్యులుగా ఉంటారు. వీరు పరీక్షల నిర్వహణ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ బాధ్యతలు నిర్వహిస్తారు. దరఖాస్తు స్వీకరణ మొత్తం ఆన్‌లైన్‌లో పద్ధతిలోనే ఉంటుంది.

## రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు : సీఎం రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

నియమించానంటే తమ ప్రభుత్వం జర్నలిస్టులకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోందని అన్నారు. శుక్రవారం సాయంత్రం జేఎన్‌జేలో సభ్యులైన అన్ని పత్రికల, టీవీ మీడియాకు చెందిన ప్రధాన ప్రతినిధులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కల్సి జేఎన్‌జేకు కేటాయించిన ఇళ్ల స్థలాల అప్పగింత ప్రక్రియ వంద రోజుల్లోగా మొదలుపెడతానన్న హామీ ని అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ ప్రస్థానం గురించి జేఎన్‌జే ప్రతినిధులు వివరిస్తూ 16 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వమే నిజాంపేట, పేట్‌బషీర్‌బాద్‌లో 70 ఎకరాల స్థలాన్ని జేఎన్‌జేకు కేటాయించిదని సీఎంకు తెలిపారు. ఆ తరువాత జరిగిన పరిణామాలతో సొసైటీకి స్థలాన్ని అప్పగించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినా గత ప్రభుత్వంలో ఈ తీర్పు అమలుకాలేదని... ఇప్పటి వరకు ఈ స్థలాన్ని కాపాడుకుంటూ వచ్చామని వారు వివరించారు. ఈ సొసైటీలోని 60 మంది సభ్యులు ఇప్పటికే మరణించారని.. మరో 20 మంది సభ్యుల ఆరోగ్య పరిస్థితి బాలేదని ఆయన సీఎంకు వివరించారు. సొసైటీ సభ్యులు మరణించడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా ముఖ్యమంత్రి మ్మెల్యే సొసైటీ లో తానూ సభ్యుడినని డెవలప్మెంట్ కోసం 10 లక్షలు చెల్లించానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రము లో అర్హులైన మిగిలిన జర్నలిస్టులకు కూడా స్థలాలు ఇచ్చే విషయంలో కూడా మీడియా అకాడామీతో చర్చించి కార్యారణను రూపొందిస్తే వారికి కూడా స్థలాలను ఇస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆరోగ్యభద్రతా కార్డులతోపాటు ఇతర సమస్యలపై కూడా దృష్టిసారించామని తెలిపారు. ఈ సమావేశంలో ఉన్న రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా వెంటనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 2 భారీ ఎలివేటేడ్ కారిడార్లు

### కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) హైదరాబాద్ నుంచి జిల్లాలకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతుండగా.. కేంద్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. హైదరాబాద్ నుంచి కరీనంగర్, హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ మార్గాల్లో జేబీఎస్ నుంచి శామీర్ పేట, మేడ్చల్ వరకు 2 భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో.. ఆ రూట్లలో వెళ్లే జిల్లా వాసులకు ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం లభించనుంది. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోన్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా మారుతోంది. నగరంలో ఇప్పటికే వందకు తగ్గకుండా ఫ్లై ఓవర్లు, పదుల సంఖ్యలో అండర్ పాసులు నిర్మించగా.. ట్రాఫిక్ సమస్య మాత్రం తగ్గట్లేదు. తాజాగా.. అండర్ రోడ్డు టన్నెల్స్ నిర్మించాలని ప్రతిపాదించింది. అయితే.. నగరం నుంచి జిల్లాలకు వెళ్లే మార్గాల్లో కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తుంది. నగరం నుంచి దగ్గర్లోని ప్రధాన పట్టణాలకు వెళ్లేందుకు 3 నుంచి 4 గంటల సమయం పడితే.. అందులో నగరాన్ని దాటేందుకే గంటన్నరకు పైగా టైం పడుతుండటం గమనార్హం. అందులోనూ.. జేబీఎస్ నుంచి శామీర్ పేట రూట్, మేడ్చల్ రూట్‌లో భారీగా ట్రాఫిక్ సమస్య ఉంటుంది. అయితే.. వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు ఆయా మార్గాల్లో భారీ ఎలివేటెడ్ కారిడార్లకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు పెట్టగా.. ప్రస్తుతం వాటికి లైన్ క్లియర్ అయ్యింది.

హైదరాబాద్– కరీంనగర్ రాజీవ్ రహదారితో పాటు హైదరాబాద్– నాగ్‌పూర్ జాతీయ రహదారిపై భారీ ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపించగా.. కేంద్ర రక్షణ శాఖ అనుమతి ఇచ్చింది. అయితే.. ఆ మార్గాల్లో డిఫెన్స్ భూములు ఉండటంతో.. వాటి మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించాలని గత ప్రభుత్వంలో చాలా సార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేయగా.. చివరికి లైన్ క్లియర్ అయింది.

అయితే.. ఇటీవలే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి.. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి డిఫెన్స్ భూముల మీదుగా ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించాలని లేఖను అందించారు. దీనిపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎలివేటేడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతులు జారీ చేసింది. ఈ సందర్భంగా.. అనుమతులు ఇచ్చిన పీఎం నరేంద్ర మోదీకి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎనిమిదేండ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించటంతో ఉత్తర తెలంగాణ దిశగా రవాణా మార్గాల అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఈ రెండు కారిడార్ల ఏర్పాటుతో.. హైదరాబాద్ నుంచి శామీర్‌పేట, హైదరాబాద్ నుంచి మేడ్చల్ దిశగా ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. హైదరాబాద్– కరీంనగర్ రూట్‌లో ప్రయాణం మరింత వేగంగా, సాఫీగా జరగనుంది.

గత ప్రభుత్వంలో.. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల పొడవు డబుల్ డెక్కర్ స్కైవే నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఈ స్కైవే నిర్మాణంతో సిద్దిపేట, కరీంనగర్ , పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు హైదరాబాద్‌కు సాఫీగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని అప్పటి ప్రభుత్వం వివరించింది. డబుల్ డెక్కర్ స్కైవే మూడంచెల పద్ధతి ఉంటుందని వివరించగా.. పైభాగంలో మెట్రోరైలు, మధ్యలో ఫ్లై ఓవర్, కిందిభాగంలో రోడ్డు ఉంటుందని తెలిపారు. అయితే.. మరి రేవంత్ రెడ్డి సర్కార్.. అదే ప్రతిపాదనను అమలు చేస్తుందా లేదా.. కొత్త డిజైన్ అమల్లోకి తెస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



## బీఆర్ఎస్‌కు షాక్

**మొదటి పేజీ తరువాయి...**

ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడంతో పాటు ఇతరత్రా కారణాలు కూడ నేతలు ఇతర పార్టీల్లో చేరడానికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ గత మాసంలోనే బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా ఇద్దరు బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు బీజేపీలో చేరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థుల ఎంపిక కోసం ప్రధాన పార్టీలు సన్నద్ధమౌతున్న తరుణంలో ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు బీఆర్ఎస్ ను వీడడం చర్చకు దారి తీసింది. తెలంగాణ రాష్ట్రం నుండి రెండంకెల స్థానాల్లో ఎంపీ సీట్లను కైవసం చేసుకోవాలని బీజేపీ వ్యూహారచన చేస్తుంది. ఈ క్రమంలోనే కమల దళం బీఆర్ఎస్ నేతలకు వల వేస్తుంది. గులాబీ పార్టీలో అసంతృప్త నేతలకు ఆ కమలదళం గాలం వేస్తుంది. ఈ క్రమంలో ఇద్దరు బీఆర్ఎస్ ఎంపీలు బీజేపీ గూటికి చేరారు.




## ధరణి సమస్యలకు చెక్

**మొదటి పేజీ తరువాయి...**

ఇది అమల్లోకి వచ్చింది. అనేక రైతు కుటుంబాలు దెబ్బతిన్నాయి. దాని అమలుతో లక్షల ఎకరాలు మాయమయ్యాయి ”అని ఆయన ఆరోపించారు. ధరణిపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేస్తామని పునరుద్ఘాటించిన మంత్రి.. పథకాన్ని పూర్తిగా పునరుద్ధరిస్తామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మార్చి 9లోగా కలెక్టర్లు, సీసీఎల్‌ఏ క్లియర్ చేసే సమయానికి రెవెన్యూ మంత్రి ధరణి, రెవెన్యూ అధికారులతో కమిటీ వేసి ‘శ్వేతపత్రం’ రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ డ్రైవ్ పూర్తయిన తర్వాత ‘శ్వేతపత్రం’ సమర్పించే అవకాశం ఉందని ధరణి ప్యానెల్ ఛైర్మన్ ఎం.కోదండ రెడ్డి స్పష్టం చేశారు.

## గంటసేపు ఉత్కంఠ..

### ఐఏఎఫ్ విమానం సేఫ్ ల్యాండ్

హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) వాయుసేన విమానానికి తప్పిన పెను ప్రమాదం తప్పింది. భారత వైమానిక దళానికి చెందిన C-130J సూపర్ హెర్క్యులస్ రవాణా విమానం సాంకేతిక లోపంతో శుక్రవారం బేగంపేట విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయిందని రక్షణ ప్రకటన తెలిపింది. ఇటీవల విమానాల్లో ఆకస్మికంగా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ప్రమాదాలకు గురికావడం తెలిసిందే. కొన్ని సార్లు భారీ ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవిస్తుంది. శుక్రవారం హైదరాబాదులో భారత వైమానిక దళానికి చెందిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో తీవ్ర ఆందోళన నెలకొంది. దాదాపు 40 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. చివరికి ఎలాగోలా పైలెట్లు ఆ విమానాన్ని బేగంపేట విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. వివరాల్లోకెళ్తే.. భారత వైమానిక దళానికి చెందిన సి–130జె సూపర్ హెర్క్యులస్ రవాణా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. విమానం కిందికి దిగే సమయంలో హైడ్రాలిక్ వింగ్స్ తెరుచుకోలేదు. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక సమస్య తలెత్తడంతో పైలట్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, బేస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. విమానాశ్రయంలో ల్యాండింగ్ ఎమర్జెన్సీని ప్రకటించారు. ఈ క్రమంలో విమానంలోని ఇంధనం అయిపోయేలా పైలట్ గాలిలోనే దాదాపు 40 నిమిషాల పాటు చక్కర్లు కొట్టారు. చివరికి ఎలాగోలా పైలెట్లు ఆ విమానాన్ని బేగంపేట విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. విమానంలో ఇద్దరు పైలట్లతో సహా మొత్తం 12 మంది సురక్షితంగా ఉండడంతో, అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## తెలంగాణలో అమల్లోకి గృహజ్యోతి

**మొదటి పేజీ తరువాయి...**



బిల్లులను అందజేస్తున్నారు. జీరో బిల్లులు అందుకున్న వినియోగదారులు ఎలాంటి బిల్లును చెల్లించాల్సిన అవసరం లేదు. షాద్ నగర్‌లో 76 యూనిట్ల (200 యూనిట్ల లోపు) వినియోగించిన ఓ వినియోగదారుడికి బిల్లు రూ. 371 కాగా, ఆ మొత్తం స్థానంలో జీరో బిల్లును జారీ చేశారు. బిల్లు చిటీలలో గృహజ్యోతి సబ్సిడీ కింద ఆ మొత్తాన్ని మైనస్ చేస్తున్నారు. ‘జీరో బిల్లులు’ జారీ చేసేందుకు బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ ప్రక్రియ మరికొద్ది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనుందని చెప్పారు. అయితే గృహజ్యోతి స్కీమ్ కింద విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న సబ్సిడీ వ్యయాన్ని కవర్ చేయడానికి.. డిస్కమ్‌లు ప్రతి నెల సబ్సిడీ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నాయి. ప్రభుత్వం ఆ మొత్తాన్ని డిస్కమ్‌లకు రీయింబర్స్ చేయనుంది. ఇక, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతామని చెబుతున్నామని చెబుతుంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండో రోజే.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంచింది. ఇక, తాజాగా ఫిబ్రవరి 27న రూ. 500కే గ్యాస్ సిలిండర్, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తాము ఇచ్చిన గార్యంటీలను నమ్మి ప్రజలు తమకు ఓటు వేశారని, తాము ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని అన్నారు. విపక్షాలు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా తమ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు.



## మేడిగడ్డ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: కేటీఆర్

మహదేవ్‌పూర్: మేడిగడ్డ అంశంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను శుక్రవారం భారాస నేతల బృందం పరిశీలించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. “కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూపిస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు, రూ.లక్ష కోట్లు వృథా చేశారంటూ అధికార పార్టీ దుష్ప్రచారం చేయడం సరికాదు. పగ, కోపం ఉంటే రాజకీయంగా మాపీ తీర్చుకోండి. రైతులు, రాష్ట్రంపై వద్దు. 1.6కి.మీ బ్యారేజ్‌లో 50 మీటర్ల ప్రాంతంలో సమస్య ఉంది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నట్లుగా అధికార పార్టీ నేతలు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయి. నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ లీకేజ్‌లు వచ్చాయి. వాటిపై మేం రాజకీయాలు చేయలేదు. నిపుణుల సలహాలు తీసుకొని వరదలు వచ్చేలోగా మేడిగడ్డను పునరుద్ధరించాలని కోరుతున్నాం” అని తెలిపారు.

# అత్తాపూర్ ఎస్‌వీఎం గ్రాండ్ రెస్టారెంట్‌లో రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి అధికారుల తనిఖీలు






అత్తాపూర్ ఎస్ వీ ఎం గ్రాండ్ రెస్టారెంట్, బంకెట్ హాల్స్ లో ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన పాడైన చికెన్



డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్

**ఫ్రిజ్ లో రెండు రోజుల క్రితం ఉడక బెట్టిన చికెన్, తందురీ చికెన్ లు**

**రూ.50 వేల జరిమాన విధించిన డిప్యూటీ కమిషనర్ రవి కుమార్**

**హెూటల్ నిర్వాహకులు నాణ్యమైన ఆహారం వడ్డించాలని సూచన**

**ఇక మీదట తరచు తనిఖీ లు చేస్తామని హెచ్చరిక**

బుద్వేల్, మార్చి1(ప్రభాత ఉదయం) : పత్రికలలో ఇటీవల తరచూ హెూటళ్లలో పాడైన ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారని రావడంతో స్పందించిన రాజేంద్రనగర్ సర్కిల్స్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ , సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈ శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఎస్ వీ ఎం గ్రాండ్ రెస్టారెంట్ బంకేట్ హాల్స్ శుక్రవారం లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రెండు రోజుల క్రితం ఉడకబెట్టిన చికెన్ , తయారు చేసిన తందూరీ చికెన్ లను ఫ్రిజ్ లలో నిల్వ ఉంచినట్లు అధికారులు కనుగొన్నారు. దీంతో నివ్వెర పోయిన అధికారులు పాడై కనిపించిన చికెన్ ను , తందూరి చికెన్ ను బయట పార వేయించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో హెూటళ్లలో బిర్యానీ లో బల్లి వచ్చిందని , చికెన్ కర్రీలో రూపాయి సిక్కలు వచ్చాయని పలువురు ఆరోపించడం కనిపించింది. అవి వార్తా కథనాలలో రావడం చూసి ఈ తనిఖీలను చేపట్టినట్లు తెలిపారు. ఎస్వీఎం గ్రాండ్ హెూటల్లో అంతా పరిశు భ్రంగానే ఉన్నప్పటికీ ఫ్రిజ్ లలో రెండు రోజుల క్రితం తయారు చేసిన చికెన్, తందూరి చికెన్ కనిపించిందన్నారు. దాన్ని హెూటల్ నిర్వాహకుల చేత పార వేయించడం జరిగిందన్నారు. పాసిపోయిన చికెన్ ను ఫ్రిజ్ లలో నిల్వ ఉంచిన హెూటల్ నిర్వాహకులకు రూ. 50,000 ల జరిమానా విధించడం జరిగిందన్నారు. ఇకమీదట తరచూ హెూటళ్లలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. హెూటళ్ల నిర్వాహకులు సైతం నాణ్యమైన ఆహార పదార్థాలనే కష్టమర్లకు వడ్డించాలని సూచించారు.

# రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన గృహజ్యోతి జీరో బిల్లుల జారీ

**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి స్కీమ్ కింద జీరో బిల్లుల జారీ ముమ్మరంగా కొనసాగుతున్నది.**

హైదరాబాద్, మార్చి 1(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గృహజ్యోతి స్కీమ్ కింద జీరో బిల్లుల జారీ ముమ్మరంగా కొనసాగుతున్నది. గ్రేటర్ హైదరాబాదులో మెహదీపట్నం, రాజేంద్రనగర్, ఇబ్రహీం బాగ్ డివిజన్ లో ఎస్ ఏ ఓ లు సమ్మయ్య, వీరస్వామి, ఎంపీ రవికుమార్ లు ఈ ఆర్ ఓ లలో బిల్లింగ్ లో సాఫ్ట్ వేర్ లో తప్పిదాలు జరగకుండా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అక్కడికి చేరుకొని పర్యవేక్షించారు.విద్యుత్ అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో వినియోగదారులకు జీరో బిల్లులు అందజేశారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి నెలకు 200 యూనిట్లు వినియోగించే గృహ విద్యుత్ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ వర్తింపజేస్తున్నారు. ఈ స్కీమ్ ను ఫిబ్రవరి నెల 27న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించగా గత నెలలో విద్యుత్ వినియోగానికి సంబంధించిన బిల్లుల స్థానంలో జీరో బిల్లులు అందజేస్తున్నారు. అధికారులు జారీ చేస్తున్న జీరో బిల్లులో వినియోగించిన విద్యుత్ కు ఎంత చార్జి అయిందో పేర్కొంటున్నారు. ఆ తర్వాత గృహజ్యోతి సబ్సిడీ కింద ఆ మొత్తాన్ని మైనస్ గా చూపిస్తూ నెట్ బిల్ అమౌంట్ జీరోగా చూపిస్తున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం ఉచిత విద్యుత్ స్కీమ్ అమలు చేయడంపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




గృహజ్యోతి పథకం కింద కస్టమర్లకు జీరో బిల్లు అందజేస్తున్న మీటర్ రీడర్ మల్లేష్

**నిరంతర ప్రక్రియ: అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి నాగమణి**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు 200 యూనిట్ల లోపు విద్యుత్తును ఉచితంగా సరఫరా పథకం నిరంతరం కొనసాగుతుందని గగన్ పహాడ్ ఈ ఆర్ వో అసిస్టెంట్ ఆఫీసర్ గోపి నాగమణి తెలిపారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిలోగల విద్యుత్ రెవెన్యూ కార్యాలయం కు తమకు విద్యుత్ బిల్లులో 200 యూనిట్ల ఉచిత బిల్లు రావటం లేదని కొందరు కస్టమర్లు నేను తినటంతో అకౌంట్ ఆఫీసర్ నాగమణి ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులకు ఈ స్కీమ్ వర్తింప చేస్తున్నారన్నారు. ఈ స్కీమ్ కు అర్హతలు ఉండి ఈ పథకం లబ్ధి పొందలేని వారికి ఆమె తగిన సూచనలు చేస్తున్నారు. గృహజ్యోతి పథకం నిరంతర ప్రక్రియ అని అర్హులైన వారు జిహెచ్ఎంసి, మున్సిపల్, మండల కార్యాలయాలల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రభుత్వం ఈ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది అన్నారు.



రాజేంద్రనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

# హిమాయత్ సాగర్ వద్ద 125 కిలోల గంజాయి స్వాధీనం

బుద్వేల్, మార్చి1(ప్రభాత ఉదయం) : ఒడిసా నుంచి భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఎల్లందు నుంచి వయా హైదరాబాద్ మీదుగా జహీరాబాద్ కు కారులో 125 కిలోల గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న కారు డ్రైవర్ ను రాజేంద్రనగర్ పోలీసులు, ఎస్ ఓ టీ పోలీసులు శుక్రవారం హిమాయత్ సాగర్ వద్ద వలపన్ని పట్టుకున్నారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... ఒడిస్సా ప్రాంతానికి చెందిన సోమేష్ జహీరాబాద్ కు చెందిన శివాజీ తో మాట్లాడుకుని గంజాయిని పంపిస్తున్నాడు . భద్రాది కొత్తగూడెం జిల్లా ఎల్లందు వచ్చి సపావత్ వెంకన్న (26) అనే డ్రైవర్ తో మాట్లాడుకుని ఏపీ 31 బిఎఫ్ 8521 నెంబర్ కారు లో 61 ప్యాకెట్లతో ఉన్న 125 కిలోల గంజాయిని పంపించడానికి మాట్లాడుకున్నాడు. అందుకుగాను వెంకన్నకు పదివేల రూపాయలు ఇస్తానని ఒప్పుకున్నాడు . ఖర్చులకు 1500 రూపాయలు ఇచ్చి కారులో గంజాయిని వేసి జహీరాబాద్ లో ఉండే శివాజీకి పంపించాడు . గురువారం ఇల్లందు నుంచి బయలుదేరిన వెంకన్న శనివారం మధ్యాహ్నం కు హైదరాబాద్ హిమాయత్ సాగర్ వద్దకు చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ బి నాగేంద్రబాబు, ఎస్ఐ రమేష్ , ఎస్ఓటి పోలీసులు హిమాయత్ సాగర్ వద్ద వెంకన్న గంజాయితో వస్తున్న కారు ను ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది . దీంతో వెంకన్న ను అరెస్ట్ చేశారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా నుంచి గంజాయిని పంపించిన సోమేష్, జహీరాబాద్ కు చెందిన శివాజీ లు పరారీ లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న ఇన్స్పెక్టర్ బి నాగేంద్రబాబు, ఎస్ఐ రమేష్ పోలీసులను డిసిపి సిహెచ్ శ్రీనివాస్, అడిషనల్ డిసిపి విజయ్ కుమార్, ఏసిపి లక్ష్మీనారాయణలు అభినందించారు.




గంజాయిని తరలిస్తున్న కారు



# మేడిగడ్డపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుంది

**మేడిగడ్డకు మరమ్మతులు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి..**

**ప్రతిపక్షం మీద బురదజల్లే ప్రయత్నం.. మేడిగడ్డ' పై రాజకీయాలు వద్దు..**

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

రాజేంద్రనగర్,మార్చి01(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే మేడిగడ్డపై రాజకీయం చేస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.శుక్రవారం పార్టీ ఎమ్మెల్యేలు,పార్లమెంట్ సభ్యులు,ఎమ్మెల్సీలు,ముఖ్య నాయకుల బృందంతో కలిసి మేడిగడ్డను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...మేడిగడ్డ పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు.కుంగిన మూడు పిల్లర్ల ను మరమ్మతు చేసి రైతాంగాన్ని ఆదుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం పాకులాడుతుందన్నారు. మేడిగడ్డ బారేజ్‌లోని రెండు పిల్లర్లు కుంగిన విషయంపై కాంగ్రెస్ పార్టీ నేతలు మొత్తం ప్రాజెక్టుపైనే విమర్శలు చేయడం సరికాదన్నారు. కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేయడం లేదని. ప్రాజెక్టులో నీళ్లు నింపకుండా కాలయాపన చేస్తూ రైతాంగానికి సాగునీటిని అందించకుండా జాప్యం చేస్తుందని మండిపడ్డారు.కాళేశ్వరం జలాలతో బీడు భూములకు సాగునీటిని అందించే చర్యలు వేగవంతం చేయాలన్నారు.ఆరు నెలలో మేడిగడ్డ బ్యారేజీని పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇవ్వాల్సింది పోయి రాజకీయం చేయడం మంచి పరిణామం కాదన్నారు.సాగు,తాగు నీరు లేక నాలుగు జిల్లాల ప్రజలు, రైతులు ఇబ్బందిపాలవుతున్నారని,ఇప్పటికైనా రైతులపై ప్రేమతో వెంటనే మరమ్మతు పనులు చేపట్టి పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కుంగిన పిల్లర్ల వద్ద కాపర్ డ్యామ్ ను నిర్మించాలని అన్నారు.

# నేడు గండిపేట ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం

గండిపేట, మార్చి 1(ప్రభాత ఉదయం) కోకాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం వివిధ మరల నిమిత్తం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని నార్సింగి విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన గార్ కార్పొరేషన్, బాబు ఖాన్ విల్లాస్, 250 యాడ్స్ కోకాపేట్, ప్రైవేట్ 28 విల్లాస్, గోల్డ్ ఫిష్, మై హెూమ్ లేబర్ క్యాంప్, 60 యాడ్స్, అక్షయపాత్ర రోడ్డు, ఓసియన్ పార్క్, జీన్స్ ఫోర్ సీజన్స్, లెజెండ్ విల్లాస్, పావని బౌలే వార్డ్, గండిపేట్, శంకర్ పల్లి రోడ్డు ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.



ఆరంఘర్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు టర్మినల్‌ను ఏర్పాటు చేయాలని ధర్నా చేస్తున్న ఏఐటియుసి నాయకుడు జైపాల్ రెడ్డి

# ఆరంఘర్ చౌరస్తాలో అంతరాష్ట్ర బస్ టర్మినల్ బస్టాండును నిర్మించాలని ధర్నా

**ఈ స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేయాలి**

**బస్ టర్మినల్ ఏర్పాటుతో ప్రయాణికులకు సౌకర్యం, తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ**

రాజేంద్రనగర్, మార్చి 1(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరంఘర్ చౌరస్తాలో గల ప్రభుత్వ భూమిలో ఆర్టీసీ టెర్మినల్ ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరంఘర్ చౌరస్తాలో ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనపల్లి జైపాల్ రెడ్డి , సిటిజన్ వెల్ఫేర్ కౌన్సిల్ అధ్యక్షులు డి.అనంత మోహన్ లు మాట్లాడుతూ... రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కాటేదాన్ రెవెన్యూ సర్వేనెంబర్ 54 లో4 ఎకరాల18 గుంటలు, సర్వేనెంబర్ 55 లో4 ఎకరాల 24 గుంటలు, సర్వేనెంబర్ 56 లో 7 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమి 16 ఎకరాల 20 గుంటల భూమి ఉందన్నారు. ఈ భూమి జీవో.ఎం.ఎస్ నెంబర్ 1406, తేదీ 4/9/1964 జారీ చేసి అప్పుడు ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ కు కేటాయించిందన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ ఈ స్థలంలో గత కొన్నేళ్లుగా మానసిక వికలాంగుల కేంద్రాన్ని కొనసాగించింది. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ఈ సంస్థ వ్యవస్థాపకులు కాలం కావడంతో నిర్వహణ సరిగా మానసిక వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ప్రభుత్వం దృష్టికి రావడంతో అక్కడి నుండి నగర శివారు దుండిగల్ కు తరలించారు. గత ప్రభుత్వంలో ఈ భూమిని ఆక్రమించడానికి పెద్దలు కబ్జా చేయాలని ప్రయత్నాలు చేయడం జరిగింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా పని చేసిన డీఎస్ లోకేష్ కుమార్( ఐఏఎస్) ప్రభుత్వ భూమిని కబ్జాకు గురికాకుండా మండల రెవిన్యూ అధికారులతో సర్వేనెంబర్ 54/2 %డ% 55/2 ఆరంఘర్ చౌరస్తాలోని నేషనల్ హైవే 44 కు అనుకొని ఉన్న భూమిని మ్యాపు వేసి సర్వే చేయించడం జరిగిందన్నారు.మండల అధికారులు ఫైల్ నెంబర్: %ణ%/581/2017 రెవిన్యూ అధికారులు సర్వే చేసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు పంపడం జరిగింది. అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ లోకేష్ కుమార్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కు %ాతీ.చీశీ.ాజ%1/4407/2017. తేదీ 13 /11/ 2018 రోజు ఆర్టీసీకి 7 ఎకరాల 22 గుంటలను ఆధీనంలోకి తీసుకొని అంత రాష్ట్ర బస్ టర్మినల్ బస్టాండును నిర్మించాలని రాతపూర్వకంగా తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ భూమి కేటాయింపు పత్రాలను పంపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆస్థలం ఆర్టీసీ స్థలమని బోర్డు పెట్టాలని వెంటనే అంత రాష్ట్ర బస్ టర్మినల్ బస్టాండ్ నిర్మిస్తే ఈ ప్రాంతం నుండి బెంగళూరు తిరుపతి ,కర్నూలు , మహబూబ్ నగర్ కొల్లాపూర్, నాగర్ కర్నూల్ ,వనపర్తి, గద్వాల, నారాయణపేట్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణిస్తున్న ప్రజలకు మంచి సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ సర్వే నంబర్లలో ఇంకా మిగిలి ఉన్న 8 ఎకరాల 38 గుంటల ప్రభుత్వ భూమి ఉండాలి అధికారులు వెంటనే కబ్జాలకు గురైన భూమిని వెలికి తీయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనపల్లి జైపాల్ రెడ్డి సిటిజన్ వెల్పర్ కౌన్సిల్ డీ. అనంత మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల ఏఐటీయూసీ నాయకులు ఆనంద్, సాయిలు,మహమ్మద్ ఖాజాభాయ్, సత్యం, బాల్ రాజ్, జగన్, కృష్ణారెడ్డి, రాజు, నరేందర్, రామకృష్ణ , నరసింహ, నాగేష్ , శ్రీహరి , తదితరులు పాల్గొన్నారు.



కొండకళ్ళ నాగేందర్ రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజీవ్ రెడ్డి

# పార్లమెంట్ ఎన్నికల రాజేంద్రనగర్ ఇన్‌ఛార్జ్‌గా కొండకళ్ల నాగేందర్ రెడ్డి

రాజేంద్రనగర్, మార్చి 1(ప్రభాత ఉదయం) తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి , తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ సురభి దివేది ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ కు చెందిన కొండకళ్ళ నాగేందర్ రెడ్డి ని జరగబోయే పార్లమెంటు ఎలక్షన్ లో రాజేంద్రనగర్ ఇన్ ఛార్జ్ గా నియమిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్ రెడ్డి , నేషనల్ సెక్రెటరీ జిశాన్ హైమద్ ప్రకటించారు.. ఈ సందర్భంగా కొండకళ్ళ నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ... చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో యువత పాత్ర ముఖ్యంగా ఉండాలని ఆరు గ్యారంటిలలో నాలుగు గ్యారంటిలు నెరవేర్చామన్నారు. ప్రజాపాలన తో సీఎం రేవంత్ రెడ్డి పాలన గురించి చెప్పి ప్రజలలోకి వెళ్ళాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేయాలని చెప్పారు.



పాఠశాలలో నల్లాలకు మరమ్మతు చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

# ప్రభుత్వ పాఠశాలలో నీటి సమస్య పరిష్కరించిన నవ యువ యూత్ క్లబ్

రాజేంద్రనగర్, మార్చి 1(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ మైలర్ దేవ్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత మూడు మూడేళ్లుగా టాయిలెట్, మరుగుదొడ్లులకు నీటి వసతి లేక విద్యార్థిని విద్యార్థులు దుర్వాసనతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పాఠశాల విద్యాకమిటి చైర్మన్ గుత్తి నరేష్ సాగర్ ఈ సమస్యను నవ యువ యూత్ క్లబ్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే క్లబ్ అధ్యక్షులు ఏర్వకుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి సమస్యకు స్పందించి బాబుల్ రెడ్డి నగర్ కు చెందిన జగన్,నరేష్ సాగర్ ల సహకారంతో ప్లంబర్ పని చేసి టాయిలెట్, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం సమస్య పరిష్కరించారు. నవ యువ యూత్ క్లబ్ తరపున పల్లపు జగన్,నరేష్ సాగర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంచందర్ నవ యువ యూత్ క్లబ్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యాక్షులు రమేష్ రెడ్డి కోరారు.

# స్థానిక సంస్థల ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజా ప్రతినిధులు సహకరించాలి

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల ,మార్చి1(ప్రభాత ఉదయం) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో స్థానిక సంస్థల ఉప ఎన్నికలపై రాజకీయ పార్టీ ప్రతి నిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు. కేంద్రం షెడ్యూల్ ప్రకారం మార్చి 4 వ తేదిన నోటిఫికేషన్ విడుదల అవుతుందని, మార్చి 11 న నామినేషన్ లకు తుది గడువు, మార్చి 12న నామినేషన్ ల పరిశీలన, మార్చి 14 నామినేషన్ ల ఉపసంహరణకు తుది గడువు, మార్చి 28 ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనునట్లు , ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, ఏప్రిల్ 4తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఆయన తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాకు సంబంధించిన స్థానిక సంస్థల ఓటర్లకు పోలింగ్ స్టేషన్ గద్వాల్ జెడ్పి మీటింగ్ హాల్ నందు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించిన స్థానిక సంస్థల ప్రతి నిధులు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఇందులో ఓటర్లుగా ఉంటారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ విధంగానైతే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందో అదే విధంగా ప్రవర్తన నియమావళి స్థానిక సంస్థల ఎన్నికల్లోను ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ సి సెక్షన్ సూపరింటెండెంట్ నరేష్ , గద్వాల తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సురేష్ , వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, పాల్గొన్నారు.



అఖిలపక్ష పార్టీలతో సమావేశమైన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



స్వాధీనం చేసుకున్న వాహనాలు

# పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

### ఐదుగురు అరెస్ట్, 9 బైక్‌లు, రూ.1,14,580 నగదు, రెండు మొబైల్స్ పోన్ లు స్వాధీనం

గద్వాల,మార్చి 1(ప్రభాత ఉదయం)పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న అయిదుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పర్వతాలు తెలిపిన కథనం మేరకు గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శెట్టి ఆత్మకూరు గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమచారం రాగ జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు గద్వాల్ రూరల్ మరియు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి 5 మందిని పట్టుకున్నారు. మిగతా వారు పారిపోగా వారి నుండి 9 ద్వి చక్ర వాహనాలు, రెండు మొబైల్స్ , రూ. 1,14,580 నగదు , ప్లే కార్డ్స్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని రూరల్ ఎస్సై పర్వతాలు తెలిపారు.కేసు నమోదు అయిన వారిలో బస్వాపురం గ్రామానికి చెందిన తిరుమలేష్ గౌడ్, గట్టు మండలానికి చెందిన వెంకటేష్, టమాటా వెంకటేష్ , శెట్టి ఆత్మకూరు గ్రామానికి చెందిన నరసింహులు, ఎల్లప్ప, జాంపల్లి గ్రామానికి చెందిన పద్మ రెడ్డి, జానీ, మున్నూరు కాపు గోపాల్, నత్తి నారాయణ, గోవిందు, వడ్డీల వెంకటన్న, సత్యం, పాండు, ఉలిగేపల్లి గ్రామానికి చెందిన తిమ్మారెడ్డీ, నిమ్మకాయల తిప్పన్న, గద్వాల పట్టణానికి చెందన జమాల్ సింగ్, చంద్రన్న, ఎనుమాల లక్ష్మణ్, పెంచికలపాడు గ్రామానికి చెందిన కెమెరా రాముడు,మదనపల్లి గొల్ల ఆంజనేయులు, అల్లపాడు నరసింహులు ఉన్నారు.



ఎమ్మెల్యేలతో కలిసి కరివేన ప్రాజెక్టును సందర్శించిన వంశీచంద్ రెడ్డి

## పాలమూరుకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేసాడు

### సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి

#### కరివేన ప్రాజెక్టును సందర్శించిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేల బృందం

మహబూబ్ నగర్, మార్చి1(ప్రభాత ఉదయం) పాలమూరు - రంగారెడ్డి (కరివేన) ప్రాజెక్టును సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేలు సందర్శించారు దేవరకద్ర ఎమ్మెల్యే, మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జి. మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు వాకిటి. శ్రీహరి , వీర్లపల్లి శంకర్ , అనిరుద్ రెడ్డి , పర్ణిక రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు కరివేన ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు 27 వేల కోట్లు కేటాయించి ఒక్క ఎకరాకు కూడా బిఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదని తెలిపారు, ప్రాజెక్టు పేరుతో అడ్డగోలు దోపిడీకి పాల్పడే పాలమూరు జిల్లా కు బిఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కేసీఆర్ కు రాజకీయ బిక్ష పెట్టిన పాలమూరు జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని, కృష్ణా జలాలను ఆంధ్రా పాలకులు దోచుకుపోతుంటే కేసీఆర్ కు భయపడి దద్దమ్మల ఇక్కడి మాజీ ఎమ్మెల్యేలు చూస్తుండిపోయారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పిన కేసీఆర్.. తొమ్మిదేళ్లయిన పూర్తి చేయలేదన్నారు. ప్రాజెక్టు పొడవునా నాసిరకం పనులు జరుగుతున్నాయన్నారు.



రామభక్తుల తో అయోధ్య బయలుదేరిన రైలుకు జండా ఊపుతున్న బిజెపి నాయకులు

## అయోధ్య బాలరాముని దర్శనానికి బయలుదేరిన రామభక్తులు

గద్వాల ,మార్చి1(ప్రభాత ఉదయం) అయోధ్య బాలరాముని దర్శనం కోసం గద్వాల రైల్వే స్టేషన్ నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో రామభక్తులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా గద్వాల రైల్వే స్టేషన్ లో రెండో విడత ప్రత్యేక రైలును బీజేపి జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, నాయకులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ప్రత్యేక చొరవ తీసుకుని గద్వాల రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో అయోధ్య రామ మందిరం దర్శనం కోసం రామభక్తులు తరలివెళ్లడం సంతోషంగా ఉందన్నారు. రామరాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో దేశంలోని కోట్లాది మంది రామభక్తుల కల నెరవేరిందన్నారు. బాల రాముడి దర్శనం కోసం వెళ్లే భక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింహులు, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి ,కౌన్సిలర్ రజక జయ ,మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, బిజెపి నాయకులు కృష్ణారెడ్డి, శ్యామ్ ,మోహన్ రెడ్డి, పాండు రెడ్డి, రవి అందేలా,మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



కాలువలో చెత్తను తొలగిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## రైతన్నలకు దన్నుగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట,మార్చి1(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కనిమెట్ట,నిర్వెన్ రైతన్నలు బోరుబావుల కింద వరి సాగు చేసి తగినంతగా పంట పొలాలకు సాగునీరు అందకపోవడం వల్ల భూగర్భ జలాలు తగ్గడంతో సాగు చేసి ఎండిపోతున్న రైతన్నల గోడును కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి చొరవతో దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి సూచనతో జెసిపి తో కాలువలలో సీల్టు ఎత్తివేసి నీటిపారుదల అధికారులతో మాట్లాడి మోటార్లతో సాగునీటికి రైతుకు దన్నుగా నిలబడి భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా శంకర సముద్రం రిజర్వాయర్ నుండి ఎండుతున్న పంట పొలాలకు సాగునీరు అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కనిమెట్ట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి, ఆకుల శ్రీనివాసులు, నరుకుల వెంకటన్న, మాసులు,బోయ ధర్మన్న, మంద నందన్న, నక్కల బుచ్చన్న, కొండన్న తదితర రైతులు పాల్గొన్నారు.

# రామేశ్వరం కేఫ్‌లో భారీ పేలుడు

## పలువురికి తీవ్ర గాయాలు




బెంగళూరు, మార్చి 1 (ప్రభాత ఉదయం) కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఉన్న ఫేమస్ రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. నిత్యం అత్యంత రద్దీగా ఉండే ఈ రామేశ్వరం కేఫ్‌లో పేలుడు సంభవించడం పెను సంచలనంగా మారింది. ఈ పేలుడులో రామేశ్వరం కేఫ్‌లో పని చేస్తున్న సిబ్బంది, కస్టమర్లు సహా మొత్తం ఇప్పటివరకు ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక.. కేఫ్‌కు వచ్చిన కస్టమర్లు, స్థానికులు, సిబ్బంది భయంతో పరుగులు తీశారు. రామేశ్వరం కేఫ్‌లోని వంటగదిలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగిందని కేఫ్ సిబ్బంది తెలిపారు. అయితే ఈ పేలుడు సిలిండర్ పేలుడు కాదని.. బాంబు పేలుడు అని ఎంపీ తేజస్వీ సూర్య వెల్లడించడం పెను సంచలనం అవుతోంది. బెంగళూరు నగరంలోని కుండలహళ్లి ప్రాంతంలో ఉన్న రామేశ్వరం కేఫ్‌లో ఈ ప్రమాదం జరిగింది. పేలుడు సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఇంకా ఎవరైనా గాయపడిన వారు ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. పేలుడు ధాటికి రామేశ్వరం కేఫ్‌లో ఉన్న ఫర్నీచర్, వస్తువులు ఎగిరిపడ్డాయి. చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువుల మధ్యలో ఎవరైనా ఉన్నారా అని పోలీసులు గాలింపు చేపట్టారు. రామేశ్వరం కేఫ్‌లో పేలుడు జరిగిందని తమకు కేఫ్ సిబ్బంది సమాచారం అందించినట్లు వైట్‌ఫీల్డ్ ఫైర్ స్టేషన్ అధికారులు వెల్లడించారు. వెంటనే ఫైర్ ఇంజిన్లు, సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టామని తెలిపారు. కేఫ్‌లో ఉన్న కిచెన్‌లో గ్యాస్ సిలిండర్ పేలినట్లు తమకు సిబ్బంది చెప్పినట్లు అధికారులు వివరించారు. ఘటనాస్థలంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఫైర్ అధికారులు పేర్కొన్నారు. కానీ ఈ ఘటనపై బెంగళూరు సౌత్ ఎంపీ, బీజేపీ నేత తేజస్వీ సూర్య మాత్రం అనుమానాలు వ్యక్తం చేశారు. తాను రామేశ్వరం కేఫ్ వ్యవస్థాపకుడు నాగరాజుతో మాట్లాడానని.. కేఫ్ పేలుడు సంఘటన గురించి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అయితే కేఫ్□కు వచ్చిన ఓ కస్టమర్ వదిలి వెళ్లిన బ్యాగు కారణంగానే పేలుడు సంభవించిందని చెప్పినట్లు తేజస్వీ సూర్య ట్వీట్ చేయడం పెను సంచలనంగా మారింది. అది గ్యాస్ సిలిండర్ పేలుడు కారణంగా జరిగింది కాదని చెప్పారని పేర్కొన్నారు. దాన్ని బట్టి చూస్తే ఇది స్పష్టంగా బాంబు పేలుడు కేసు అని అర్థం అవుతోందని.. దీనిపై సమాధానం ఇవ్వాలని సీఎం సిద్ధరామయ్యను బెంగళూరు వాసులు అడుగుతున్నారని తేజస్వీ సూర్య ట్వీట్ చేశారు.

### హైదరాబాద్‌లో హైఅలర్ట్ ప్రకటన

బెంగళూరు పేలుళ్ల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. శుక్రవారం సాయంత్రం నగరంలో హైఅలెర్ట్ ప్రకటించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులను అప్రమత్తం చేశామని.. కీలక ప్రాంతాల్లో తనిఖీలు జరుపుతున్నట్లు నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. బెంగళూరు కేఫ్ పేలుడు కారణాల గురించి ఆరా తీస్తున్నామని చెప్పారాయన. జూబ్లీ బస్టాండ్, ఎంజీబీఎస్తో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రద్దీ ప్రాంతాలతో పాటు మాల్స్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల బారికేడ్లను ఏర్పాటు చేసి.. అనుమానాస్పద వెహికిల్స్‌ను పోలీసులు తనిఖీ చేస్తున్నారు.

## సందేశ్‌ఖాలీ నేరస్థుడిని దీదీ కాపాడుతున్నారు

### మమతా బెనర్జీపై ప్రధాని మోదీ సంచలన ఆరోపణలు



కోల్‌కతా, మార్చి 1 (ప్రభాత ఉదయం) పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో చేటుచేసుకున్న ఘటనలకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సీఎం మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. శుక్రవారం బెంగాల్‌లోని ఆరమ్‌బాగ్‌లో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని మాట్లాడారు. సందేశ్‌ఖాలీలోని మహిళల బాధల కంటే కొంతమంది ఓట్లు సీఎం మమతకు ముఖ్యమా? అని బెంగాల్ ప్రజలు అడుగుతున్నారని మోదీ అన్నారు. ఈ ఘటనపై ప్రతిపక్షాల 'ఇండియా కూటమి'పై విమర్శలు చేశారు. సందేశ్‌ఖాలీ మహిళల విషయంలో ఇండియా కూటమి మౌనం వహిస్తుందని మండిపడ్డారు. బెంగాల్‌లో టీఎంసీ (మాత, భూమి, ప్రజలు) అనే నినాదాన్ని పలుకుతుంది. అలాంటిది సందేశ్‌ఖాలీ మహిళల విషయంలో టీఎంసీ ఏం చేసింది.? అని మోదీ ప్రశ్నించారు. సందేశ్‌ఖాలీ ఘటనపై దేశం మొత్తం కోపంగా ఉందని తెలిపారు. ఈ వ్యక్తులు చేసే పనులు చేసి సంఘ సంస్కర్త రాజా రామోహన్‌రాయ్ ఆత్మ శోకిస్తుందని మోదీ మండిపడ్డారు.

## పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకోసం ఉచిత శిక్షణ



హైదరాబాద్, మార్చి 1 (ప్రభాత ఉదయం) 15 రోజుల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా నిపుణులైన లెక్చరర్ లతో పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ప్రారంభిస్తామన్నారు డిప్యూటీ భట్టి విక్రమార్క. ప్రశ్నాపత్రాలు లీకులు లేకుండా పారదర్శకంగా ఉద్యోగాలు వచ్చే విధంగా కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. బడ్జెట్ పెట్టే సమయంలో పాదయాత్రలో తనకు ఎదురైన అనుభవాలన్నీ గుర్తుచేసుకొని కేటాయింపులు చేశానన్నారు. డిసెంబర్ 7న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. నాటి నుంచి డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలోనే వడ్డీ మాఫీ చెక్కులను అందించేందుకు భారీ సభ నిర్వహించాలని నిర్ణయించామని భట్టి విక్రమార్క తెలిపారు. మహిళలను మహాలక్ష్మిలుగా చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించే మహిళలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలకు బకాయి లేకుండా ప్రతినెల వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతికొద్ది రోజుల్లోనే గ్రూప్ 1నోటిఫికేషన్ కూడా విడుదల చేశామన్నారు. రాష్టంలో ప్రతి బిడ్డ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనేదే ఈ ప్రభుత్వా లక్ష్యమన్నారు. ఈ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాట.. ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎవరిని మోసం చేయాలని ఆలోచన తమకు లేదన్నారు. పదేళ్లు ప్రజలకు భ్రమలు కల్పించి పబ్బం కడుపుకోవాలనే ఆలోచన అంతకన్నా లేదన్నారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఈ పార్టీ మరో వందేళ్లు రాష్ట్రాన్ని, దేశాన్ని పాలన సాగించి ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న 22క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గద్వాల , మార్చి1(ప్రభాత ఉదయం)అక్రమంగా తరలిస్తున్న 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గద్వాల జిల్లా కేటిదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కేటిదొడ్డి పోలీసులు కుచినెర్ల గ్రామ శివారులో నంబర్ లేని అశోక్ లీలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రేషన్ బియ్యం ఉండటంతో డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని విచారించారు. గద్వాలలో రేషన్ కార్డు లబ్దిదారుల నుంచి తక్కువ ధరకు సేకరించిన రేషన్ బియ్యంను రాయచూరులో ఎక్కువ ధరకు విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించి, డ్రైవర్ క్రిష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

## కాళేశ్వరం ప్రాజెక్టు తనిఖీకి కేంద్ర బృందం ఏర్పాటు



న్యూఢిల్లీ, మార్చి 1 (ప్రభాత ఉదయం) కాళేశ్వరం ప్రాజెక్టు తనిఖీకి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేసింది. మేడిగడ్డ ప్రాజెక్టును తనిఖీ చేసి నాలుగు నెలల్లో నివేదిక అందజేయాలంటూ కేంద్ర జలశక్తి ఆదేశాలు జారీ చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తనిఖీ చేసి, సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకాలని కేంద్రం ఆదేశించింది మరోవైపు, వచ్చే వానాకాలంలో గోదావరికి వచ్చే వరదలతో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు మరింత నష్టం వాటిల్లకుండా పరిరక్షించడంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ దృష్టిసారించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ చట్టం కింద ఏర్పాటైన 'డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్'మంగళవారం రెండు బ్యారేజీలను సందర్శించింది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(అడ్మిన్) అనిల్ కుమార్ నేతృత్వంలో డిజైన్ ఎక్స్‌పర్ట్ టి.రాజశేఖర్, సీఈ సీడీఓ, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) ఇంజనీర్ల బృందం రెండు బ్యారేజీలను పరిశీలించిన అనంతరం సత్వరంగా తీసుకోవాల్సి న నష్టనివారణ చర్యలపై చర్చించింది. గోదావరిలో మళ్లీ 20 లక్షల క్యూసెక్కులకు పైగా వరద పోటెత్తితే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందనే అనుమానాలు ఉండటంతో ఈ బృందం అక్కడ పర్యటించింది. నష్టనివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. దీని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవ కాశం ఉంది. అన్నారం బ్యారేజీకి శాశ్వత మరమ్మతులు నిర్వహించిన తర్వాతే నీళ్లు నింపాలని గతంలోనే ఎన్డీఎస్ఏ సూచించింది. మరమ్మతులు జరిగే వరకు బ్యారేజీలో నీళ్లు నిల్వ చేసే అవకాశం లేదు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.